క్లుప్తంగా

జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాజేష్ యాదవ్



తొర్రూరు: యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణవాసి బాసనబోయిన రాజేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యప్ప రెడ్డి నియామక పత్రాన్ని అందజేశాడు. రాజేష్ యాదవ్ కొంత కాలంగా కాంగ్రెస్ యువజన విభాగం మండల నాయకుడిగా పార్టీ పటిష్టతకు కృషి చేశాడు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సోదర భావానికి ప్రతీక రంజాన్



దంతాలపల్లి: సోదరభావానికి ప్రతీక రంజాన్ పండుగ అని దాట్ల జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య అన్నారు. బుధవారం విద్యార్థులతో కలిసి మందస్తు రంజాన్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో తీపి పదార్థాలు తయారు చేపించి విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజయ్‌కుమార్, విజయ్‌కుమార్, స్వప్న, రమేష్, మంజూశ్రీ, ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, మాధవి పాల్గొన్నారు.

హోమియోపతి వైద్య దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: ప్రపంచ హోమియోపతి వైద్య దినోత్సవం పురస్కరించుకొని హోమియోపతి వైద్య ప్రధాత డాక్టర్ శ్యామ్యూల్ హానిమన్ 269 జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలో శ్యామ్యూల్ చిత్రపటానికి డాక్టర్ పరికిపండ్ల అశోక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు టీషర్టులు బహూకరించి హోమియోపతి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, చంద్రదేవ్, సమాజ సేవకులు, వనప్రేమికుడు దైద వెంకన్న, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు వద్దిరాజు రామచందర్‌రావు పాల్గొన్నారు.

అర్చకులకు ఘన సన్మానం



గార్ల: గార్లలోని హిందూ దేవాలయాల్లో అర్చక వృత్తి నిర్వహిస్తున్న అర్చకులకు బుధవారం స్థానిక వర్తక సంఘం భవనంలో శ్రీరామదండు 108 కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. తొలుత కమిటీ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అదేవిధంగా దేవాలయాలకు విగ్రహాలు అందజేసిన దాతలు అత్తులూరి సత్యం రమాదేవి దంపతులను, హిందూ ధర్మం బలోపేతానికి కృషి చేస్తున్న వారిని సైతం శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు కలమ్ అగర్వాల్, కట్టా రమేష్, పుల్లఖండం రమేష్‌బాబు, విశాల్‌జైన్, పుల్లఖండి వేణుగోపాల్ పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత



గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు గూగులోత్ యువరాజ్‌కు అదే గ్రామానికి చెందిన తోటి స్నేహితులు రూ.10వేల విలువ గల నిత్యావసర సరుకులను బుధవారం అందజేశారు. యువరాజ్ నెలరోజుల క్రితం బైక్ ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోవడంతో మంచం పట్టాడు. కార్యక్రకమంలో స్నేహితులు భూక్యా హరినాయక్, గంగావత్ అరుణ్, ఎస్‌కె సర్వర్ పాషా, ధరావత్ భీమ్‌సింగ్ పాల్గొన్నారు.

నేటినుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

గూడూరు: మండలంలోని అప్పరాజ్‌పల్లి గ్రామంలో ఈనెల 11వ తేదీ గురువారం నుంచి 13వ తేదీ శనివారం వరకు సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సీతాలక్ష్మణహనుమత్ సమేత కోదండరామ చంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయని నిర్మాణ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు.

బడుల బలోపేతానికి ఆదర్శ కమిటీలు



తొర్రూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సాహెబ్



దోర్నకల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసనాయక్

తొర్రూరు: బడుల బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు దోహదపడతాయని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ తెలిపారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ కమిటీలపై అవగాహన కల్పించారు. సమాఖ్య అధ్యక్షురాలు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. అమ్మలను పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించి వారే కీలక పాత్ర పోషించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్‌లుగా ఆయా గ్రామా సంఘాల అధ్యక్షులు వ్యవరిస్తారని, కోచైర్మన్‌లుగా పాఠశాలల హెచ్‌ఎంలు ఉంటారని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ.97.80 లక్షలు మంజూరైనట్లు వాటిని అత్యవసర మనుల నిమిత్తం వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మహంకాళి బుచ్చయ్య, డీపీఎం నళిని, ఏపీఎం సంజీవరావు, ఏఈ అరుణ్‌తేజ్, రాయిపల్లి యాకయ్య, హెచ్‌ఎంలు, వీఓలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి

దోర్నకల్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు పాఠశాలల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని ఎంపీడీఓ శ్రీనివాసనాయక్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, భవనాలు తదితర వసతుల కల్పనలో కమిటీల పాత్ర కీలకమన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు, ప్రతీ రోజు హాజరు నమోదు బాధ్యతలు కూడా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై కమిటీలు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఆంగోత్ లక్ష్మా, ఏపీఎం శంకర్‌నాయక్, డీపీఎం శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ శాదర్ అలీ, ఆర్‌పీ సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

పెద్దవంగర: పాఠశాలల్లో అభివృద్ధి పనులను అమ్మ ఆదర్శ కమిటీలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని ఆయా పాఠశాలల్లో కమిటీ చైర్మన్‌లతోపాటు హెచ్‌ఎంలు (కన్వీనర్లు), పలు విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం చేపట్టారు. ఎంపిక చేసిన పాఠశాల్లో పేరుకుపోయిన పనులను గుర్తించాలని, త్వరలోనే నిధులు మంజూరు అవుతాయని, అభివృద్ధి పనులు జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ హెచ్‌ఎం శ్రీనివాస్, ఎంపీఓ సత్యనారాయణ, ఏపీఎం రమణాచారి, ఏఈ అశోక్, ఆయా గ్రామాల అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

వసతులు మెరుగుపర్చాలి

దంతాలపల్లి: ప్రభుత్వ పాఠశాలలో వసతులు మెరుగుపర్చాలని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలకేంద్రంలో గల జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యంతో పాటు చిన్నచిన్న రిపేర్‌లు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రాము, ఏపీఎం బిట్ల దివాకర్‌రాయ్, విద్యాశాఖ మండల నోడల్ అధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

నెల్లికుదురు: ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ బాలరాజు, ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎ.రాందాస్, ఏపీఎం వరదయ్య, హెచ్‌ఎం స్వప్న, ఎంపీఓ పార్థసారథి, ఆర్‌అండ్‌బీ ఏఈ రాజు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్యవసర పనులు పూర్తి చేయాలి

మరిపెడ: పాఠశాలలో అత్యవసర పనులు పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఏఈ శివకుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఓరియేంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. పాఠశాలలో విద్యుద్దీకరణ, తాగునీటి కల్పనకు అవసరమైన పనులు మే10లోపు పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ రేవతి, ఎంఎన్‌ఓ అనితాదేవి, డీఆర్‌పీఓం రామ్మూర్తి, ఏపీఎం రాములు, ఏపీసీ ఆర్పీ యాదగిరి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు డ్రిప్ పైపులు దగ్ధం

తొర్రూరు: ప్రమాదవశాత్తు డ్రిప్ పైపులు దగ్ధమైన ఘటన బుధవారం డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని దుబ్బతండాకు చెందిన ధరావత్ శ్రీనివాస్ పంటలకు నీరు అందించేందుకు డ్రిప్ పైపులు తన వ్యవసాయ భూమిలో భద్రపరిచాడు. శ్రీనివాస్ వ్యవసాయ భూమి పక్కనే వ్యవసాయ మార్కెట్ ఉంది. మార్కెట్ సిబ్బంది సమీపంలో చెత్తను కాల్చారు. దీంతో మంటలు వ్యాపించి డ్రిప్ పైపులను దగ్ధం చేశాయి. బాధితుడు కన్నీరుమున్నీరయ్యాడు. మార్కెట్ సిబ్బంది వలనే తనకు సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని, నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఆలయంలో చోరీ

దోర్నకల్: మండలంలోని చిలుకోడు గ్రామ శివారు గంగమ్మతల్లి ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేసి నగదును చోరీ చేశారు. హుండీలో రూ.30వేలకు పైగా నగదు చోరీ జరిగిందని, ఆలయ కమిటీ ప్రతినిధి నూకల ఉపేందర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌రావు తెలిపారు.

సబ్‌స్టేషన్ పరిశీలన

గార్ల: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్‌శాఖ డీఈ విజయ్ విద్యుత్ ఏఈ మహేంద్రబాబు, విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం గార్ల సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు.

సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న కళాశాల బృందం

మహబూబాబాద్ అర్బన్: విద్యను ఆయుధంగా చేసుకొని అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు వెంకటేశ్వర్లు, రత్నమాల, అధ్యాపకులు మమత, యుంగేధర్, బొంద్యాలు, రాజేందర్, సుజిత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, నరహరి, హతిరామ్, ఖాసీం, ఉపేందర్, సుమలత, సంతోష్, పీడీ శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు పాటుపడాలి

గూడూరు: బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. మండలంలోని మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో బుధవారం సంఘం ఆధ్వర్యంలో హెచ్‌ఎం ఈసంపల్లి ప్రభాకర్ అధ్యక్షతన జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మోకాళ్ల వెంకన్న, కోడెం రజిత, మేడ వసంత, చుంచ బాలయ్య,నలమాస వెంకటేశ్వర్లు, యాకూబ్, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

మహబూబాబాద్ అర్బన్: మహనీయులైన మహాత్మ జ్యోతిరావుపూలే, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను గ్రామగ్రామాన విద్యార్థులు, మేధావులు ఘనంగా నిర్వహించాలని అంబేడ్కర్ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇనుగుర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో యుగేందర్, రఘు, శశి, బాబురావు, శ్రీనువాస్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

దోర్నకల్: ఎండలు రోజురోజుకూ పెరుగుతున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని ఎంపీపీ బాలునాయక్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మరిపెడ రూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి దాతలు చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని గుండెపుడి ఎంపీటీసీ సభ్యురాలు పులుసు రంజితచిరంజీవి అన్నారు. మండలంలోని గుండెపుడి గ్రామంలో మాజీ సర్పంచ్ నూకల కిషన్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీటీసీ బుధవారం ప్రారంభించారు.

వీల్‌చైర్‌ల పంపిణీ



కురవి: నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు ఐసీఎం సంస్థ ఆధ్వర్యంలో ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ నూకత వేణుగోపాల్‌రెడ్డి, సంస్థ మహబూబాబాద్ జిల్లా లీడర్ సేవ్యానాయక్ 14 మంది దివ్యాంగులకు వీల్‌చైర్‌లను బుధవారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏలియా, గణేష్, ఏసుపాదం పాల్గొన్నారు.

బీజేపీతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం

- ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

తొర్రూరు: బీజేపీతోనే వరంగల్ సమగ్రాభివృద్ధి సాధ్యమని పార్టీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలుపు కోరుతూ బుధవారం డివిజన్ కేంద్రంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో తొర్రూరు, రాయపర్తి, పెద్దవంగర మండలాల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అరూరి రమేశ్ మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో 400 పార్లమెంట్ స్థానాలు బీజేపీ గెలుచుకుంటుందన్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానం గెలిచి ప్రధానికి బహుమతిగా ఇవ్వాలన్నారు. మామునూరు విమానాశ్రయం, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, పాలకుర్తిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ వంటి హామీలు నెరవేరాలంటే వరంగల్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ గెలవాలన్నారు. రాయపర్తి మాజీ ఎంపీపీ నాగపురి రాంబాబు, తొర్రూరు బీఆర్‌ఎస్ నాయకులు చలువాది సత్యనారాయణ, కేవ్‌సింగ్‌లతో పాటు పలు పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, రాజేశ్వర్ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వైపీ రావు, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్, పల్లె కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



మాట్లాడుతున్న వాసునాయక్

నెహ్రూసెంటర్: జిల్లాలో గల ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు పక్కన గల ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 551లో కొంత మంది కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. గిరిజనులు ఇంటి స్థలాల కోసం భూముల్లో గుడిసెలు వేస్తే వారిపై కేసులు పెట్టారని, భూములను కబ్జాలు చేసిన వారిపై ఎందుకు చర్య తీసుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు బోడ రమేష్‌నాయక్, ఉపాధ్యక్షులు భూక్య బాలాజీనాయక్, ఇస్లావత్ నరేష్‌నాయక్, బాదావత్ మదన్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. తారు మరిచారు



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో తారు రోడ్డు నిర్మాణానికి కంకర పరచి తారు పోయడం మర్చిపోయిన ఆర్‌అండ్‌బీ అధికారుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. చిన్నగూడూరు–మరిపెడ రహదారిలోని ఉగ్గంపల్లి గ్రామంలో రోడ్డుపై కొంత వరకు కంకర వేసి తారు పోయకుండానే వదిలేశారు. దీంతో కంకర తేలి అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయాందోళనకు గురవుతున్నట్లు ప్రయాణికులు, వాహనదారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంకర రోడ్డుపై తారు రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బుచ్చిమల్లు, రమేష్, శ్రీను, రామచంద్రు, యాకయ్య తదితరులు ఉన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న షీ టీం ఎస్సై సునంద

మహబూబాబాద్ రూరల్: అపరిచిత వ్యక్తులతో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య ఆధ్వర్యంలో మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సునంద మాట్లాడుతూ.. విద్యార్థులందరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్ గాని, వాట్సాప్ కాల్ గాని మాట్లాడవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపిన లింకులను ఓపెన్ చేయవద్దని, ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కి కాల్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. మహిళలు ఆపద సమయంలో డయల్ 100, షీటీం నంబరును సంప్రదించాలన్నారు. షీటీం వాట్సాప్ నంబర్లు 87126 56935, 79011 42009కి తెలియచేస్తే తగిన చర్య తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, శివరాణి, మల్లారెడ్డి, సతీష్ కుమార్, తిరుపతి, షీటీం ఏఎస్సై ఆనందం పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య

గార్ల: అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసై, జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం గార్లలో చోటుచేసుకుంది. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. గార్లలోని గాంధీపార్క్ బజారుకు చెందిన నోముల ఉపేందర్(47) పేయింటింగ్ పని చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. భార్యను తరచూ కొడుతుండటంతో వేదింపులు తాళలేక భార్య ఇద్దరు పిల్లలను తీసుకొని 16 ఏళ్ల క్రితం పుట్టింటికి వెళ్లి అక్కడే ఉంటుంది. నాటి నుంచి ఉపేందర్ తల్లి వద్దనే ఉంటూ పేయింటింగ్ పనులకు వెళ్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంతకాలం నుంచి ఉపేందర్‌కు ఫిట్స్ రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఇటీవల ఉపేందర్ తల్లి కూతురు ఇంటికి వెళ్లింది. ఇదే అదునుగా భావించిన ఉపేందర్ జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే ఇరుగుపొరుగు వారు తల్లి కమలమ్మ, పోలీసులకు సమాచారం ఇచ్చారు. తల్లి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

‘ఉపాధి’ చట్టాన్ని నిర్వీర్యం చేసిన కేంద్రం



కూలీలతో మాట్లాడుతున్న కుర్ర మహేశ్

మహబూబాబాద్ రూరల్: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిన కేంద్ర ప్రభుత్వాన్ని బొంద పెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుర్ర మహేశ్ అన్నారు. మండలంలోని సంద్రలగూడెం గ్రామ శివారు పులుసుమల్ల కుంటలో ఉపాధి హామీ పనులను బుధవారం కుర్ర మహేశ్ సందర్శించి మాట్లాడారు. ఉపాధి అమలులో కూలీల ప్రతి అంశం సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నా సరే కూలీల పెండింగ్ బిల్లులు మాత్రం రావడం లేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు 150 రోజుల పని దినాలు కల్పించి, రూ.350 వేతనం ఇస్తామని చెప్పిన హామీలు అమలు కావడం లేదన్నారు. పనులు చేసిన కూలీలకు పే స్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో శేషం ప్రశాంత్, జరుపుల హరిలాల్, విజయ్, రవి, శ్రీరామ్, ఆకాష్, రాంజీ, కూలీలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైంది

మహబూబాబాద్ అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్, ఎన్నికల నోడల్ అధికారి అధికారి ఏ.మరియన్న అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో బుధవారం స్వీప్ అధికారులు ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నేటి పౌరులే రేపటి నవ సమాజ నిర్మాణానికి, అభివృద్ధికి మార్గదర్శకులన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దార అమరావతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, స్వీప్ సిబ్బంది అశోక్‌పాల్, శ్యామ్, భిక్షపతి, ఉపాధ్యాయులు సతీష్, రవి, ప్రవీణ్‌కుమార్, వసియా, సుల్తానా, రజిని పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘ప్రజాపోరాటాలను కళారూపాలుగా మర్చారు..’

బయ్యారం: ప్రజాపోరాటాలను కళారూపాలుగా మార్చిన మహోన్నత వ్యక్తి అరుణోదయ వ్యవస్థాపకులు కానూరి వెంకటేశ్వరరావు అని ప్రముఖ కవి, రచయిత జీవన్ అన్నారు. బుధవారం బయ్యారంలో నిర్వహించిన కానూరి వర్ధంతి సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు గోవర్ధన్, జిల్లా కార్యదర్శి ఐలయ్య, బాబురావు, నాయకులు వేణు, పద్మ, తారాచంద్, చారి హరీశ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థన ఏర్పాట్ల పరిశీలన

మహబూబాబాద్ రూరల్: ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కొత్తబజారులో గల ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనల కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి బుధవారం పర్యవేక్షించారు. కార్యక్రమంలో వార్డు మున్సిపల్ కౌన్సిలర్ ఎండి.సలీం, గద్దె రవి, ఖలీల్, ముస్లిం మతపెద్దలు ఇబ్రహీం, యూసుఫ్, రంజాన్ అలీ, సలీం, తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రకు విద్యార్థులు

దంతాలపల్లి: సైన్స్, చరిత్ర కట్టడాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి అన్నారు. 6నుంచి 9వరకు విద్యార్థులను బుధవారం విహారయాత్రకు తీసుకెళ్లారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా మండలకేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల ఒక్కటే ఎంపికైందన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికి రూ. 500 చొప్పున విహార యాత్రకు మంజూరు చేసిందని తెలిపారు.

వైభవంగా మార్వాడీల ‘ఘన్‌గోర్’ ఊరేగింపు



మహబూబాబాద్ రూరల్: మార్వాడీల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపడుతూ భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఘన్‌గోర్ వేడుకలో భాగంగా శివపార్వతుల స్వరూపమైన గోరా, ఈసర్ (ఘన్‌గోర్) విగ్రహాల ఊరేగింపును బుధవారం సాయంత్రం మానుకోటలో ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య పట్టణ వీధుల్లో ఘన్‌గోర్‌ల ఊరేగింపు చేశారు. అనంతరం గోరా, ఈసర్‌ల విగ్రహాలను మహేశ్వరీభవన్‌లోని రాధాకృష్ణుల సన్నిధిలో ఏర్పాటు చేసి మార్వాడీ మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సఖీ మండలి సభ్యులు మాంగీబాయి ఝువర్, రాజకుమారిలోయ, పద్మ కలంత్రి, చందా ఝువర్, అరుణ ఝువర్, ప్రేమాఆసోపా, హేమాలోయ, రాణి సోంటువాల్ పాల్గొన్నారు.